

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ మంగళవారం పారాయణ ప్రారంభం ★

# శ్రీ సాయి లీలామృతము



## అధ్యాయము - 23

## సమాధానమిచ్చే సమాధి

### (i)

**జీ**వన్ముక్తులు ప్రళయంలో గూడ నశించరని భగవద్గీత, యోగవాశిష్టమూ చెబుతున్నాయి. ఇక పూర్ణ దత్తావతారమైన బాబాకు జీవులనుద్ధరించడమే అవతారకార్యం గనుక ఆయన లీల మహాసమాధికి ముందులాగానే నేడుగూడ కొనసాగుతోంది. అంతవరకు భక్తులతో ఆయనకుగల అనుబంధం అలానే కొనసాగుతుంది. కాకా మహాజనికి నవంబర్ 13, 1918న స్వప్నంలో సాయి కన్పించి, "నేను సమాధి చెంది నెల అయింది. మాసికపూజ చేయి" అన్నారు. అతడు నిద్రలేచి చూస్తే ఆ మాట అక్షరాలా నిజమైంది. ఆ రోజు అతడు సాయిని పూజించి కాకాదీక్షిత్, ప్రధాన్, హేమాద్పంతులకు భోజనం పెట్టాడు. అలానే, నాగేష్ అనే భక్తుడు సమాధి ప్రక్కగదిలో నిద్రించేవాడు. అప్పుడప్పుడతనికి, తోటివారికీ సమాధి నుండి రకరకాల సంగీతం వినిపిస్తుండేది. అంతటితో వారాగదిలో నిద్రించడం మానేసారు. కె. కె. ప్రధాన్‌కు అనేకసార్లు గురుస్థానంలో సాయి భౌతికంగా దర్శనమిచ్చారు. ఒకప్పుడు తాత్యా తీవ్రమైన ఉబ్బసంతో బాధపడ్డాడు. వైద్యుడు మందిచ్చి దానిని 'అంజీర్' పండ్లరసంతో తీసుకోమన్నాడు. అది ఆ పండ్లు దొరికే ఋతువుగాదు. ఒకరోజు ఆరతయ్యాక అతడింటికి వస్తూ, "ఇప్పుడు బాబా నన్ను పట్టించుకోవడంలేదా? ఇప్పుడా పండ్లు దొరకవే, ఏం జేయాలి?" అనుకున్నాడు. ఆశ్చర్యం! తలుపు తెరిచేసరికి పూజలో బాబాపటం వద్ద అప్పుడే కోసిన అంజీరాలు 14 వున్నాయి! ఒక చైత్రమాసంలో దాసగణు శిరిడీలో 17 రోజులు హరికథ చెప్పాడు. ఒకరోజు బాబా పాదాలనుండి గంగా-యమునా జలాలు వచ్చిన లీల విని కొందరు భక్తులు నమ్మలేదు. చిత్రం! నాటినుండి కొన్నిరోజులు సమాధి పడమర అంచున నీరు సన్నని ధారలా కారింది. అదెక్కడి నుండి వస్తున్నదో ఎవరికీ తెలియలేదు.

సాయి దేహంతో వున్నప్పుడు అతి చనువు వలన వారిని చాలినంత భక్తిశ్రద్ధలతో పూజించలేకపోయానని శ్యామా పరితపించాడు. ఆయన ప్రసాదించిన ఊదీ పొట్లం ప్రాణప్రదంగా పూజలో పెట్టుకున్నాడు. అతడు బొంబాయి వెళ్ళినపుడు ఒకరాత్రి బాబా కలలో కన్పించి, "నేనిచ్చిన ఊదీ పొట్లం రోడ్డుప్రక్కన చెత్తకుండీలో వున్నది. త్వరగా వెళ్ళు!" అని హెచ్చరించారు. శ్యామా యిల్లు చేరి చూస్తే పూజలో ఆ పొట్లంలేదు, ఇల్లు సర్దడంతో దానినెవరో తీసారు! ఇంటి ప్రక్కనున్న చెత్తకుండీలో చూస్తే పొట్లం దొరికింది.

సం॥ 1942 నుండి శిరిడీవచ్చే భక్తులసంఖ్య పెరగజొచ్చింది. వారికోసం వసతిగృహాలు నిర్మించడానికి సంస్థానంవారు గురుస్థానం దగ్గర భూమిని కొనదలిచారుగాని, కేశవనారాయణ కులకర్ణి అది అమ్మనన్నాడు. వారు సాయికి మొరపెట్టుకోగా, తరువాతి గురువారంరోజు రాత్రి కులకర్ణికి కలలో బాబా కన్పించి, "నిజానికాభూమి నాది; అది నీవు సంస్థానానికి వెంటనే అమ్ము. నీకు మూడింతలు లాభమొస్తుంది" అన్నారు. అతడు వెంటనే సంస్థానానికే అమ్మాడు. ఆ పైకంతో అతడు గ్రామంలో వేరొక స్థలం కొనాలని చూస్తే ఆ ఆసామి అమ్మనన్నాడు. ఆ ఆసామికి కలలో బాబా కన్పించి, ఆ స్థలం అతనికి అమ్మమని చెప్పారు. ఆ వ్యవహారం వలన అతడికి మూడురెట్లు

లాభమొచ్చింది.

డాక్టర్ రుస్తుంజీ సం॥ 1930లో నిమోనియా వచ్చి బొంబాయిలోని పార్శీ జనరల్ ఆస్పత్రిలో స్పృహలేకుండా పడివున్నాడు. ఆ మైకంలో అతనికి ఒక ఫకీరు కన్పించి, "నేనెవరో తర్వాత నీకే తెలుస్తుంది" అని, ఒకసారి అతని మంచం చుట్టూ తిరిగి అదృశ్యులయ్యారు. తరువాత డాక్టర్లు అతనిని పరీక్షించి అతడారోగ్యంగా వుండటం చూచి విస్తుబోయారు. తనను కాపాడిన ఫకీరెవరా అని అతడాలోచిస్తూండేవాడు. ఒకసారి, బస్సులో సాటి ప్రయాణీకుని దగ్గర ఒక పుస్తకంలో బాబాపటం చూచాడు. తనను కాపాడినది ఆయనేనని గుర్తించి, వారి చరిత్ర పారాయణ, పూజ ప్రారంభించాడు. అతనిని 1949లో సాయి సంస్థానంవారు శిరిడీలోని ఆస్పత్రిలో నియమించారు. ఒకప్పుడితని భార్యకు కళ్ళజబ్బు వచ్చింది. ఆమె రోజూ సాయి సమాధికి ప్రదక్షిణంచేసి, తనకు వ్యాధి తగ్గితే సాయిబాబా పల్లకీకి స్వయంగా గుడ్డకుట్టి సమర్పిస్తానని మ్రొక్కుకున్నది. డాక్టర్లు ఆ వ్యాధికి మందులేదని నిర్ణయించినా, ఆమె వ్యాధి ఒక సం॥లోగా తగ్గిపోయింది. ఆమె తనమ్రొక్కు చెల్లించుకున్నది.

భయంకరమైన క్షయవ్యాధితో బాధపడుతున్న శివశంకర్ దీక్షిత్‌కు ఒకరాత్రి కలలో ఎవరో ముస్లిం మహాత్ముని పటం కన్పించింది. అతడు నమస్కరిస్తుండగా స్వప్నంలోనే ఒక ఫకీరు అతని నొసట ఊదీ పెట్టి, త్వరలో రోగం తగ్గుతుందని చెప్పాడు. మొదట అతడు ఆ స్వప్నాన్ని పట్టించుకోలేదు. కాని, నాటినుండీ ఏమందూ లేకుండానే వ్యాధి తగ్గిపోయింది! ఆ సంగతి విని, ఆ ఫకీరు సాయి అయివుండవచ్చని ఒక మిత్రుడు చెప్పాడు. నాలుగు రోజుల తర్వాత పిల్లలాడుకొంటూ ఒక కాగితం అతని ముందు పడేసి వెళ్ళారు. అందులో సాయి సమాధి చిత్రము, దానిపైనొక సాయిపటమూ వున్నాయి. తనకు స్వప్నదర్శనమిచ్చినది వారేనని గుర్తించి అతడు శిరిడీ వెళ్ళాడు. కాని అక్కడ సమాధిమీద చిత్రపటానికి బదులు పాలరాతి విగ్రహమున్నది. భక్తులను విచారించగా, 1956 వరకూ అక్కడ చిత్రపటమే వుండేదని, ఆ సంవత్సరమే విగ్రహం ప్రతిష్ఠించారనీ చెప్పి ఆ ఫోటోను చూపారు.

చిత్తూరు జిల్లాలోని ఒక గ్రామంలో 1959లో మొహరం పండుగనాడు ముస్లింలందరూ చేరారు. మౌల్వీగూడ సిద్ధమయ్యాడు గాని, పీరు ఎత్తవలసిన భక్తుడు రాలేదు. అప్పుడక్కడున్న కె. తిరువెంగళంను పీరు ఎత్తమన్నారు. అతని నడుముకు పీరుకొయ్య కట్టి, ఆ గుడ్డతో అతని ముఖం కప్పారు. వెంటనే అతనికి బాహ్యస్మృతి తప్పింది. "నాకొక్కసారిగా మెరుపుల కాంతి కన్పించింది. ఎక్కడా చిన్న రాయిగాని, గడ్డిపోచగాని లేని బ్రహ్మాండమైన మైదానం అన్నివైపులా కన్పించింది. చిన్నపిల్లవానిలా వున్న నావైపు చేతులు చాపుతూ దూరంలో ఒక ముసలాయన కన్పించారు. ఇంతలో ఎవరో నన్ను కదిలించడంతో నాకు మెలకువ కల్గింది. అప్పటినుండి భక్తిగీతాలు, భగవద్గీత విన్నా, వెంకటేశ్వరుని చూచినా, శరీరమంతా వణికి కన్నీరు కారుతుంది. ఒకసారి సాయిపటం కొన్నాను. ఎందుకోగాని ఆ మూర్తి నాకెంతో పరిచయంగా వున్నది. ఒకరోజు రేడియోలో భక్తిగీతము, నామావళి వినేసరికి నాకు బాహ్యస్మృతి తప్పి, అలనాడు పీరునెత్తినప్పటి దర్శనమే అయింది. అప్పుడు నాకు దర్శనమిచ్చిన మహనీయుడు సాయిబాబా అని గుర్తించగల్గాను" అని వ్రాస్తున్నాడు ఆ ధన్యజీవి.

నెల్లూరులో డా॥ రాజగోపాలాచారికి 1938లో ఒకరోజు కలలో ఒక ఫకీరు కన్పించారు. ఆయన మోకాళ్ళవరకూ పుండ్లున్నాయి. మరురోజు గోడకున్న పటాల మధ్యనున్న బాబాపటంపై వారి దృష్టిపడింది. అందులో బాబాకు మోకాళ్ళవరకూ చెదలుపట్టి వున్నాయి. సాయికి, వారి పటానికీ భేదం లేదని డాక్టరు గుర్తించాడు. నాటినుండి వారింట సాయిభజన, పూజ ప్రారంభించారు. కొంతకాలానికి నెల్లూరులో చక్కని సాయి మందిరం వెలసింది.

బి. బి. దూబే (హోషంగాబాద్) 1957లో ప్రమాదకరమైన ఉదరరోగంతో చాలాకాలం బాధపడ్డాడు. వైద్యులుగూడ ఆశ వదలడంతో శ్రీకృష్ణుని ధ్యానిస్తున్నాడు. నాటి తెల్లవారుఝామున కలలో కఫ్నీ, తలకు గుడ్డ

ధరించిన ఒక మహనీయుడు కన్పించారు. వెంటనే అతడు, "ఆహా! ఈయనే నా గురువు!" అని కేకపెట్టాడు. ఆ కేకకు అతనికే మెలకువ వచ్చింది. అయినా ఆ సంగతి అతనెవ్వరికీ చెప్పలేదు. సం॥లు దొర్లిపోతున్నా ఆ మహనీయుడు మరపురాలేదు. ఆయన గురించి ఏమైనా తెలుస్తుందేమోనని ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు, పత్రికలు చదువుతుండేవాడు. అతనికి 1970లో హోషంగాబాద్ బదిలీ అయింది. అతడక్కడ ఒక షాపులో ఆ మహనీయుని పటం చూచి విచారిస్తే, ఆయన శిరిడీ సాయిబాబా అని మాత్రమే చెప్పగలిగారు. తర్వాత 1972లో ఉద్యోగరీత్యా పిపారియాకు వెళ్ళినపుడు అతని మిత్రుడు తన యింట్లో సాయిపటం చూపి, ఆయన లీలలు వివరించారు. తర్వాత అతడు 1973లో శిరిడీవెళ్ళి, అప్పటినుంచి సాయిని కొలుచుకుంటున్నాడు.

శ్రీమతి సుశీలమ్మగారికి చాలాకాలం బిడ్డలు లేకుంటే, సాయిని పూజించుకొమ్మని ఆమె అన్నగారు ఒక పటమిచ్చాడు. కొద్దికాలానికి అబ్బాయి జన్మిస్తే సాయిబాబా అని పేరు పెట్టారు. ఒకసారి ఆమెకు తీవ్రంగా విరేచనాలై ఎన్ని మందులిచ్చినా తగ్గలేదు. ఆమె 21వ రోజు తెల్లవారుఝామున బైటకు వెళ్ళలేక మంచం ప్రక్కనే కూర్చుంది. సాయి గదిలో ప్రవేశించి, 'ఆ గూట్లో తాయెత్తుంచాను. కట్టుకో; బాధ తగ్గుతుంది. మూడవ రోజు దానిని పారవేయి!' అని చెప్పి వెళ్ళిపోయారు. "'ఏ గూట్లో, బాబా?' అని కేకలేస్తే అందరూ ఆమెకు భ్రమ కలిగిందనుకున్నారు కాని గూట్లో చూస్తే తాయెత్తున్నది! అది కట్టగానే విరేచనాలు ఆగిపోయాయి. తరువాత ఆమె భర్త పిళ్ళేగారు కొద్ది కాలానికి రిటైరవుతారనగా వారి అబ్బాయి 'ఎమ్.ఎస్.సి' పాసై, తుమ్మలగుంటలో బంధువులింట వుండి ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. కొంతకాలానికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో యింటర్వ్యూ వచ్చింది. సిఫార్సు లేకుంటే వెళ్ళి ప్రయోజనంలేదని తెలిసినా, తల్లి ప్రోద్బలం మీద హాజరయ్యాడు. ఆగష్టు 24, 1976న సుశీలమ్మకు సాయి స్వప్న దర్శనమిచ్చి, "నీ బిడ్డ కాగితాలు తుమ్మలగుంట వచ్చాయి. తెప్పించుకొని ఉద్యోగంలో చేరమను" అని రెండు మూడు సార్లు చెప్పారు. తుమ్మలగుంట బంధువులు అప్పుడు కాళహస్తిలో వున్నారు. వాళ్ళకు పిళ్ళే ఉత్తరం వ్రాస్తే, ఆ కాగితాలు తుమ్మలగుంట చేరాయని, వెంటనే అతడు వుద్యోగంలో చేరాలనీ టెలిగ్రామ్ వచ్చింది. అతడలా చేయడంతో పిళ్ళే రిటైరయ్యేముందు ఆ కుటుంబానికొక ఆధారం ఏర్పడింది. మరికొంత కాలానికి సుశీలమ్మగారికి దృష్టి మందగించింది. ఆమె బాధపడుతూంటే శ్రీ సాయి స్వప్నంలో కన్పించి, "కర్మానుభవం తప్పదు. ఈ జన్మలో అనుభవిస్తావో, మరుజన్మలో అనుభవిస్తావో చెప్పు!" అన్నారు. ఆమె చెప్పేలోపలే మెలకువ వచ్చింది. తరువాత ఆమె వేరే బాధల్లో వున్నప్పుడు సాయి కలలో కన్పించి, "శ్రీరామరామ రామేతి రమేరామే మనోరమే...." అన్న శ్లోకం జపించమన్నారు. మార్చి 1978లో ఆమె కన్ను అపరేషన్ చేయించుకొని యింటికొచ్చాక రాత్రి మేడమీద నిద్రపోతుంటే ఒక గబ్బిలం కన్ను పీకింది. మరురోజు డాక్టరుకు చూపిస్తే కన్నురాదని చెప్పి, యింటికి పొమ్మన్నారు. ఆమె బ్రతిమాలితే నాలుగు రోజులు ఆస్పత్రిలో వుంచారు. చివరిరోజు రాత్రి కలలో సాయి ఆమెకు కట్టువిప్పి తీర్థమిచ్చారు. పై శ్లోకమే చెప్పించి, "ఇప్పుడు కన్పిస్తున్నదా?" అన్నారు. "కన్పిస్తున్నదిగాని, యీ కర్మ మరుజన్మలో అనుభవించాలన్నారే" అని బాధపడింది. "నీకు దృష్టి యిచ్చినా, యివ్వకున్నా గొడవేనే!" అని కేకలేసి, "గుడ్డివారికి అన్నంపెట్టి, చేతనైన సహాయం చేయి. దేవునికి 10 టెంకాయలు కొట్టు. ఆ కర్మ తొలుగుతుంది' ' అన్నారు. తెల్లవారి కట్టు విప్పేసరికి ఆమెకు కళ్ళు కన్పిస్తున్నాయి. అది బాబా లీలే అన్నారు డాక్టర్లు. అంటే ఆమెకు సంతానము, ఆరోగ్యము, జీవనోపాధి, కర్మనివృత్తి ప్రసాదించారు సాయి.

పోలీసు ఆఫీసర్‌గా రిటైరయిన బి. ఉమామహేశ్వరరావుగారికి 1960 నుంచి గుండె జబ్బు, తరచుగా గుండెనొప్పితో 2,3 రోజులు స్పృహలో లేకుండా వుండేవారు. వైద్యులు ఆపరేషన్ చేయాలన్నారు గాని ఆయన యిష్టపడలేదు. బంధువుల ప్రోద్బలంతో 1980లో శిరిడీ దర్శించి అక్కడొక చిత్రమైన అనుభూతి పొంది, నాటినుంచీ సాయిని ప్రార్థిస్తున్నారు. సెప్టెంబరు 1983లో ఆయన గుండెనొప్పితో స్పృహ కోల్పోయారు. నాడి 40కి పడిపోయింది.

3వ రోజు తెల్లవారుఝామున 3 గం॥లకు స్వప్నంలో ఒక ఫకీరు వారి నుదుట ఊదీ పెట్టి, బాధ తగ్గుతుందని చెప్పారు. ఆయన వెంటనే భార్యను లేపి తన స్వప్నం చెప్పారు. ఆయన నొసట విభూతి వున్నది. తరువాత ఆయనకు గుండెనొప్పి రాలేదు. నవంబర్ 16, 1983 రాత్రి ఆయన సాయిని ధ్యానిస్తుండగా ఆ పటంనుండి చిత్రమైన కాంతి వారి గుండెమీద పడి, శరీరంలో కరెంట్ ప్రవహించినట్లయింది. వారి ఎడమరొమ్ముచుట్టూ వలయంలా చర్మం కాలినట్లు మచ్చవున్నది. అప్పటినుంచీ ఆయన ఆరోగ్యంగా వున్నారు. నవంబర్ 28, 1984న ఆయనకు బాబా కలలో కన్పించి, "రేపు నీకు గండమున్నది. బంధువులను పిలిపించుకో! నేనున్నాను, భయంలేదు" అన్నారు. ఉదయమే అందరూ సిద్ధంగా వున్నారు. ప్రొద్దున్నే ఆయన ధ్యానంలో కూర్చున్నప్పుడు పడిపోయారు. హాస్పిటల్‌కు తీసుకుపోతే ఆయన దక్కేది కష్టమన్నారు. వారి శ్రీమతి బాబాను ప్రార్థించాక ఆయన కోల్కొని, అప్పటి నుండీ సాయిసేవ చేస్తున్నారు.

దశరథరామయ్య, (కలిచేడు) యిలా వ్రాశారు : "సం॥ 1981లో ఒకనాటి రాత్రి మా యింటి ఎదుట రామమందిరంలో జరిగిన బాబా సత్సంగం నుండి మా అమ్మ ప్రసాదం తెచ్చి నాకిచ్చింది. నేనది తిని పడుకొన్నాక, బాబా కలలో కన్పించి, తమకు గడ్డిసంపంగి మాల వేయమన్నారు. మరురోజు అది సమర్పించినప్పటినుండి ఆయన మమ్మల్ని కాపాడుతున్నారు. సుమారు 20 రోజులకు నాకు గుండె నొప్పి వచ్చి, నా గదిలో పడుకొన్నాను. కలలో ఒక ఆజానుబాహుని పాదం మాత్రం నాపై నుంచి దాటుకొని పోతున్నది. నేను దానిని తాకి దండం పెట్టుకున్నాను. నా ప్రక్కమీదనున్న మూడు తమలపాకులు, రెండు వక్కలూ తినమన్న ఆదేశం వినిపిస్తే తిన్నాను. తెల్లవారేసరికి గుండెనొప్పి తగ్గిపోయింది. మరొక నెలకు పొట్టవాపు, ఆయాసమూ వచ్చాయి. ఇంట్లో అందరూ అన్నాలు గూడామాని నా మంచం చుట్టూ కూర్చున్నారు. నాకు కునుకు పట్టగానే కలలో శ్రీ సాయి దర్శనమిచ్చి, ఆవాలసైజు మాత్ర ఒకటి నోట్లో వేశారు. తెల్లవారేసరికి ఆరోగ్యంగా వున్నాను. మరోసారి ఇంజక్షన్ వలన 'రియాక్షన్' వచ్చి నా వళ్ళంతా గొడ్డళ్ళతో కొట్టినట్లు నొప్పి వచ్చింది. మళ్ళీ డాక్టర్ వద్దకు వెళ్ళలేక ఏడుస్తూ పడుకున్నాను. కునుకు పట్టగానే బాబా నా తలవద్ద కూర్చుని నా మాడుకు విభూతి అద్దుతున్నారు. ఆ స్పర్శకు నాకు మెలకువ వచ్చింది. అపుడు రాత్రి 3 గంటలైంది. నాకు తలనొప్పి మచ్చుకు గూడా లేదు. తరువాతొకసారి బాబా స్వప్నంలో నాకో నామంచెప్పి దానిని జపించుకోమన్నారు."

శ్రీమతి శేషారత్నం (ఒంగోలు) యిలా వ్రాస్తున్నారు : "బాబా మందిరంలో జరిగే అన్నదానాలకు వంట చేస్తూండటంతో చిన్ననాటి నా బాబా భక్తి మళ్ళీ మేల్కొన్నది. ఒక గురువారం నాడు మాస్టరుగారి వద్ద 'శ్రీ సాయి లీలామృతము' తీసుకున్నాను. నాటి సాయంత్రం మగతగా పడుకున్నపుడు శిరిడీలోని మశీదు, సమాధుల దర్శనమైంది, సమాధిపై గాలిలో బాబా కూర్చుని కన్పించారు. ఆయన నావైపు బెత్తం చూపి, తమ ఎదుట బాసిపట్టు వేసుకొని తలపై చీరకొంగు కప్పుకొని కూర్చోమన్నారు. అపుడు ఒక యోగముద్రచూపి, అరబ్బీలో ఒక మంత్రం చెప్పి దానిని జపించమన్నారు. మెలకువ వచ్చేసరికి ఆ మంత్రం మర్చిపోయాను. ఆ విషయం మాస్టరుగారితో చెపితే ఆయన ఆ మంత్రం కాగితంమీద వ్రాసి యిచ్చారు. మా ఆరేళ్ళపాప "శ్రీసాయి లీలామృతము" అక్షరాలు గుణించుకొని చదవటంలో తప్పులు దొర్లుతుంటే బాబా కల్లో కనిపించి, సరిగా చదవకుంటే తంతానని బెదిరించారు. పాప భయపడి చదవడమే మానేసింది. మాస్టరుగారితో చెబితే పాపకు ప్రసాదమిచ్చి, "ఈసారి సరిగా చదువు, బాబా కొట్టరులే!" అన్నారు. నాటి రాత్రి పాపకు మళ్ళీ కలలో బాబా కనిపించి, 'భయంలేదు. చదువు' అని ప్రేమగా చెప్పారు.

కె. నవనీతం (వడమాలపేట) యిలా వ్రాస్తున్నది : "నేను 1975లో యమ్. ఏ. పాసై ఒక యోగ శిక్షణా

శిబిరంలో శిక్షణ పొందుతుండగా ఒక సహపాఠి సులోచన చదువుతున్న 'శ్రీసాయి లీలామృతము' విని ఆ గ్రంథం తెప్పించి పారాయణ చేస్తున్నాను. ఒకరోజు ధ్యానంలో కాంతిమయ దేహంతో బాబా దర్శనమై చెప్పలేనంత సంతోషం కల్గింది. మరొకరోజు నా మేనల్లుడు జబ్బుచేసి చనిపోయినట్లు, నేను సాయిని స్మరించి తాకగానే అతడు జీవించినట్లు కనిపించింది. అప్పుడు మా వూళ్ళో అతనికి జబ్బుచేసి కొద్దిలో ప్రమాదం తప్పిందట. ఒకప్పుడు ధ్యానంలో నా శరీరం పైకెగిరి దూరాన పడుతుండటం వలన ఒళ్ళు నొప్పులు, జ్వరమూ వచ్చాయి. అప్పుడు ఊదీ తీసుకొని, బాబా సందేశం కోసం 'శ్రీసాయి లీలామృతం' తెరచి చూస్తే, ప్రధాన్‌తో అతడి తల్లికి వచ్చిన పక్షవాతం గురించి సాయి 'నాల్గురోజులలో తగ్గుతుంది' అని చెబుతున్నారు. అందువలన నాకెంత బాధగా వున్నా మందు తీసుకోలేదు. నాల్గవరోజు రాత్రి 9-30 గంటలకుగూడ నొప్పులు తగ్గేలాలేవు! నేను, సులోచన బాబా గురించి, మాష్టర్‌గారి గురించి 11-30 దాకా మాట్లాడుకుని పడుకున్నాము. నిద్రపట్టిన 5 ని॥లలో నన్నెవరో బలంగా అదిమేసినట్లయి, భయంతో 'బాబా!' అని కేకగూడ పెట్టలేకపోయాను. తెల్లవారేసరికి నొప్పులన్నీ తగ్గిపోయాయి. నాటినుండి నా నోటివెంట శివనామం బదులు సాయినామం దొర్లుతుండటం నాకే ఆశ్చర్యమనిపించింది. "

శిరిడీలో సమాధిమీద వున్న విగ్రహం చెక్కడానికి బొంబాయినుండి తాలిమ్ అనే శిల్పి వచ్చాడు. అనేక కోణాలలో తీసిన సాయిఫోటోలే లేవు. బాబాకు తీసిన ఫోటోలు చాలాకొద్ది. అవిగూడ వేరు వయస్సులకు చెందినవి. కనుక తాలిమ్, ఎంత శ్రమించినా నమూనామూర్తి తృప్తికరంగా రాలేదు. చివరి ప్రయత్నంగా అతడు సాయిని ప్రార్థించాడు. నాటి రాత్రి బాబా అతనికి కలలో కన్పించి, "నన్ను మళ్ళీ చూడాలంటే సాధ్యంగాదు. జాగ్రత్తగా చూడు!" అన్నారు. అతడు సాయిచూట్టూ నెమ్మదిగా తిరుగుతూ, ఆయన రూపాన్ని అన్నివైపులనుండి చూచాడు. తెల్లవారగానే ప్లాస్టర్‌తో చక్కని నమూనా మలచి దానినిబట్టి పాలరాతి విగ్రహం చెక్కాడు. దానిని శ్రీసాయి శరణానంద 1954లో సమాధిమీద ప్రతిష్టించారు. అంటే అది సాయి ప్రత్యక్షంగా చేయించుకున్న మూర్తి అన్నమాట.

సాయికి, ఆయన విగ్రహానికీ భేదం లేదు. శ్రీ దిలీప్‌కుమార్‌రాయ్ అను ప్రఖ్యాత సాధకుడు పూణేలో "హరేకృష్ణ ఆశ్రమం" స్థాపించాడు. వీరికొక మిత్రుడు 1968లో ఒక సాయి విగ్రహమిచ్చాడు. ఆయన దానిని ఆశ్రమం బయట వుంచారు. నాటి రాత్రి సాయి ఆయనకు కలలో కన్పించి, "నేను చలిలో వణికిపోతున్నాను. వెచ్చగా లోపల వుంచు!" అన్నారు. ఆయన వెంటనే నిద్రలేచి, మర్నాడే ఆ విగ్రహాన్ని ఒక ప్రత్యేకమైన మందిరంలో స్థాపించారు.

## (ii)

కొందరికి సాయి అశరీరవాణి ద్వారా తమ సాన్నిధ్యమిచ్చి ఆపదలను తొలగిస్తున్నారు. కీ.శే. వెంకట నారాయణరాజు, మైసూరు సాయి మందిరంలో పూజారి. ఆయన సుమారు 17 సం॥ల పాటు రోజూ ఉదయమే కొన్ని ఆలయాలు చిమ్మి, ముగ్గులువేసి, పూజ చేసేవాడు. తర్వాత కోర్టువద్ద దస్తావేజులు వ్రాసి రోజుకు రూ 2/- లు సంపాదించేవాడు. ఒకరోజు యితడు ఈ కష్టజీవితాన్ని అంతమొందిచాలని విషం దగ్గరుంచుకొని, ఒక ఆలయంలో ధ్యానం చేసుకుంటున్నాడు. అపుడు, "నీవలన ఎన్నో జరగాలి, చనిపోవద్దు" అన్న మాటలు విన్పించాయి. వెంటనే రమణమహర్షి శరీరంతో దర్శనమిచ్చి, పై మాటలు అని, అతని చేయి పట్టుకుని, గేటు అవతల దించి వెళ్ళిపోయారు. అప్పటినుండి రాజుగారు వారినే తన గురువని తలచాడు. ఆయనే మళ్ళీ ఒకరోజు దర్శనమిచ్చి, "నీ గురువు నేనుగాదు, శిరిడీ సాయిబాబా!" అని చెప్పి అదృశ్యమయ్యారు. అప్పటినుండీ రాజుగారు సాయి భక్తుడయ్యాడు. శ్రీసాయి తరచూ వారికి కన్పించి మాట్లాడేవారు. ఎన్నోసార్లు కాకి, కోతి, ఆవుల రూపాలలో వారింటికొస్తే రాజుగారి భార్య గుర్తించక అదలించేవారట. తర్వాత బాబా అతనితో, "నేను వస్తే అమ్మ అదలించింది" అనేవారు. రాజుగారు

కొంతకాలం ఒక మర్వాడీవద్ద లెక్కలు వ్రాసేవారు. ఒకరోజు బాబా, "నీవిక కలం పట్టవద్దు. నా సేవ చేసుకో. అన్నమదే వస్తుంది!" అన్నారు. రాజు వెంటనే ఆ పని మానేశాడు.

ఒకరోజు వారింట్లో బియ్యం లేవు. నాడు ఆ మార్వాడీ భార్యకు బాబా పటంలో నుంచి, "వెంటనే రాజుకు బియ్యం పంపించు అని ముమ్మారు వినిపించింది. ఆమె వెంటనే బస్తా బియ్యం పంపింది గాని, రాజుగారు, "ఇవి తీసుకొమ్మని సాయి నాతో చెప్పాలి గదా!" అన్నారు. బాబా తర్వాత అతనిని అలానే ఆజ్ఞాపించారు. మరొక రోజు అతని భార్య బెంగుళూరు వెళ్ళారు. ఇంట్లో తినడానికేమీ లేదు. రాజుగారు సాయియే తనకన్ని యేర్పాట్లూ చేస్తున్నారు గదా అని తలచి, దక్షిణ నుండి రూ॥ 10/- లు తీసుకోబోయారు. వెంటనే బాబా చెంపమీద కొట్టి, "నా డబ్బు తీసుకుంటావట్రా" అన్నారు. అతడు నివ్వెరబోయి వీధిలోకి వెళ్ళగానే అతని బాల్య స్నేహితుడు కన్పించి, బలవంతంగా హోటల్లో భోజనం పెట్టించాడు. తర్వాత ఆ మిత్రుడు ఆ రోజు ఊళ్ళోనే లేడని తెలిసింది. రాజుగారు మైసూరు సాయిబాబా మందిరంలో చాలాకాలం సేవచేసి యిటీవలే పరమపదించారు.

యఫ్. యం. భంగారా (కొత్త ఢిల్లీ) యిలా వ్రాసాడు: "పార్శీ సాంప్రదాయకురాలైన నా భార్య, బాబాలను నమ్మదు. నేను మాత్రం నమ్ముతాను. సం॥ 1956లో ఒక సాయిబాబా క్యాలెండరు మా యింట్లో వుండేది. ఒకరోజు అనాలోచితంగా ఆయనకు నమస్కరించి, ఆయన గురించి ఏమీ తెలియకుండానే అలా యెలా చేసానని ఆశ్చర్యపోయాను. ఇల్లు సర్దుతుండగా నా భార్యకు ఆ గదినుండి, 'బిడ్డా! నాకు మాలవెయ్యి. మేలు జరుగుతుంది' అని విన్పించిదట. ఆమె వెంటనే ఆ కేలండరుకు మాల వేసింది. అప్పటినుండి దానిని పూజిస్తున్నాము. అప్పట్లో మేము ఆర్థిక యిబ్బందులలో వున్నాము. ఆమె మా కుటుంబ శ్రేయస్సు కోసము, మాకు బాబు పుట్టాలనీ సాయిని ప్రార్థించింది. ఏడాదిలోగా మాకు బాబు పుట్టాడు. నా జీతంగూడ పెరిగి, మంచి బ్యాంక్ ఆఫీసర్‌గా పేరొచ్చింది. అలా మేము కోరుకున్నదల్లా జరిగేది. అవసరంలో ఆయన సందేశంగూడ అందేది. కాని యివన్నీ మా భ్రాంతు లేమోననుకునే వాళ్ళం. ఒకరోజు నేను యిన్‌స్పెక్షన్ కోసం వెళ్తుంటే, సాయంత్రానికి తిరిగి రావాలని నా భార్య పట్టుబట్టింది. కాని బాబా దగ్గర నాకు, 'నీవీరోజు తిరిగి రాలేవు!' అని విన్పించింది. దారిలో ఒకచోట రైలుగేటు వేస్తే ఆగాము. ప్రక్క బస్సులోని పెద్దమనిషి మా డ్రైవరుతో మాట్లాడి, మా కారులో కూర్చున్నాడు. నాకు కోపమొచ్చిందిగానీ, అతనిని బాబా పంపారని సర్దుకున్నాను. తర్వాత ఒక ఘాట్ రోడ్డు మలుపులో కారు బ్రేకులు విరిగిపోయాయి. కారు వేగంతో పల్లానికి దిగుతోంది. ఎడమవైపు పెద్ద లోయ వున్నది. డ్రైవరు కారును కుడివైపు కొండకు మోటింప జూచినప్పుడల్లా ఏదో ఒకటి ఎదురొచ్చి, కొద్దిలో ప్రమాదం తప్పుతోంది. బాబా మాటలు జ్ఞాపక మొచ్చి నాకు మరణం తప్పదనిపించింది. నా హస్తరేఖలూ అలానే సూచిస్తున్నాయి. నేను భయంతో 'సాయి, నా కుటుంబం కోసమైనా నన్ను రక్షించు!' అని ప్రార్థించాను. వెంటనే టైరుబ్రద్దలై కారాగింది. డ్రైవరు టైరుమార్చి బయల్దేరాక మర్నాడే యిల్లు చేరగలిగాను. బాబా మాటే నిజమైంది"

పార్సీ మతస్థుడు మానిక్‌షా (బొంబాయి) బాబాకు సమర్పించకుండా ఏమీ తినేవాడుగాదు. అయినా చాలాకాలం శిరిడీ వెళ్ళలేకపోయాడు. ఒకసారి నాగపూర్ వెళ్తూ, మధ్యాహ్నం మన్మాడ్ స్టేషనులో నిద్ర లేవగానే, ఒక అస్పష్టమైన మానవాకారం, "నీవు మన్మాడ్‌లో దిగిపో!" అని చెప్పి అదృశ్యమైంది, వెంటనే అతడు దిగిపోయాడు. శిరిడీ దర్శించి వచ్చేసరికి నాటి మధ్యాహ్నం అతడు దిగిన రైలుకు ఆ స్టేషన్ దాటగానే పెద్ద ప్రమాదమై ఎందరో మరణించారని తెలిసింది! అలానే సంతోష్‌వ్యాస్ (హోషంగాబాద్) అక్టోబరు 1980లో శిరిడీ వెళ్తూ రైలులో యింజను నుండి మూడవబోగీలో కూర్చున్నాడు. దారిలో ఇటార్సీలో అతని హృదయంలో, "వెంటనే దిగి చివరి పెట్టెలో ఎక్కు!" అని వినిపించింది. రైలు కదిలినా అతడు త్వరగా దిగి చివరి పెట్టెలో ఎక్కాడు. మరి రెండు ని॥లలో ఆ

రైలొక గూడ్సును ఢీకొని, మూడవ బోగీలోనివారు ఎందరో చనిపోయారు.

డి.యల్. కాంతారావుగారు కొమరవోలు గ్రామంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రోజులవి. ఆ దగ్గరలో ఎక్కడా వైద్యవసతిలేదు. ఒకరోజు వారి భార్యకు ప్రసవమయ్యాక బయటపడవలసిన 'మావి' చాలాసేపు పడిపోలేదు. గంటలోగా అది పడిపోకుంటే తల్లి ప్రాణానికి ప్రమాదం. ఆమెకు స్పృహ తప్పింది. ఆయన పూజగదిలోకి వెళ్ళి, సాయిని ప్రార్థిస్తుండగా బయట, "సుబ్బమ్మ వచ్చింది!" అన్న మాటలు విన్పించాయి. ఆమె ఒక నర్సు. ఆమె వెంటనే లోపలికి వెళ్ళి ఆ బాలింతరాలి పొట్ట నొక్కగానే 'మావి' పడిపోయి, ప్రమాదం తప్పింది. ఆమె ప్రక్కన పడివున్న బిడ్డను స్పర్శించగానే కెవ్వున ఏడ్చాడు. తర్వాత తెలిసింది. సుబ్బమ్మ ఆ గ్రామస్థురాలే. విజయవాడలో నర్సుగా పనిచేస్తోంది. ఆ రోజెందుకో ఆకస్మిక ప్రేరణ కలిగి, సెలవు గూడ పెట్టకుండా వచ్చింది. వెంటనే వెళ్ళిపోవాలనుకున్నది. కానీ ఆమె యిల్లు చేరగానే యీ సంగతి తెలిసి అక్కడకొచ్చింది. **సాయి అనుగ్రహం ఎవరిద్వారానైనా మనకు చేరగలదు.**

## (iii)

మహాసమాధి తర్వాతగూడ సాయి పల్కుతున్నా అది ఆయన శరీరంతో వున్నదానితో సమానంగా కాదనుకొంటాము. దాసగణుతో కలసి 1924లో శ్రీరామనవమికి శిరిడీ వెళ్ళి తిరిగి వస్తున్నారు రామచంద్ర పాటేవర్, అతని భార్య. మధ్యలో శ్రీమతి పాటేవర్‌కు దాహమేస్తుంటే రైలుదిగి, దూరాన పంపు దగ్గరకు వెళ్ళగానే రైలు కదిలింది. ఆమె తొందరగా ఒక పెట్టెలో ఎక్కబోయి కాలుజారి, రైలుకూ, ప్లాట్‌ఫారంకూ మధ్యలో పడిపోయింది. అందరూ కేకలుపెట్టి, గొలుసు లాగారు. రైలు కొంచెం ముందుకుపోయి ఆగింది. ఆమె భద్రంగా ప్లాట్‌ఫారం పైకెక్కి, కంగారుపడుతున్న జనంతో యిలా చెప్పింది : "కాలు జారగానే నాకేమీ తోచక బాబాను తలచాను. ఆయన నా ప్రక్కనే కనబడి, తమ చేతితో నన్ను ప్లాట్‌ఫారం క్రిందకు అదిమిపట్టి, నా ప్రక్కనే వున్నారు. కనుక నాకిక భయమేయలేదు. నేను పైకొచ్చేవరకు ఆయన కనిపిస్తూనే వున్నారు!"

ఆర్. యస్. చిట్నిస్ (కొత్తఢిల్లీ) 1950లో ఎవరో మహాత్ముని చిత్రపటం చూచి మంత్రముగ్ధుడయ్యాడు. ఆయన బాబా అని తెలిసాక, వారి చరిత్ర చదివి 1952లో శిరిడీవెళ్ళి సాయి సమాధిని చూడగానే అతని జీవితమే మారిపోయి అపారమైన శాంతి అనుభవమయింది. అప్పటినుండి బాబాను పూజించుకుంటున్నాడు. సం॥ 1957లో తన చెల్లెలికి జబ్బుచేసిందని తెలిసి విమానాశ్రయంలో కూర్చున్నాడు. తాను బొంబాయి చేరేలోగా తన చెల్లెలికి జబ్బు తగ్గించమని ప్రార్థిస్తున్నాడు. ఇంతలో అతని ప్రక్కనే కాళ్ళకు చెప్పులు లేకుండా తెల్లని కఫ్నీ, తలకు గుడ్డ ధరించిన ఒక వృద్ధ ఫకీరున్నారు. ఆయన నిరాశగా చేతులు, తలా త్రిప్పి అదృశ్యమయ్యారు. ఇంకెవ్వరూ ఆయనను చూడలేదట. అతడు బొంబాయి చేరేసరికి అతని చెల్లెలు మరణించింది. సం॥ 1965లో అతనికి విపరీతమైన కడుపునొప్పి వచ్చి, నీరు త్రాగడం గూడ కష్టమైంది. డాక్టర్లు ఆపరేషన్ చేయాలంటే అతడు భయపడి బాబాను ప్రార్థించాడు. నాటిరాత్రి కలలో భయంకరులు నల్గురు అతనిపైబడ్డారు. వెంటనే సాయి వారిపైబడి తరిమేసారు. తెల్లవారేసరికి చిట్నిస్‌కు జబ్బేలేదు. సం॥ 1966లో ఒక గురువారం సాయిచరిత్ర పారాయణ పూర్తిచేసి, ఆగ్రా వెళ్ళి, దారిలో సాయి దర్శనమివ్వాలని ప్రార్థించాడు. సుమారు 60 మైళ్ళు వెళ్ళాక కారు అకస్మాత్తుగా నిలిచిపోయింది. బాబావంటి ఫకీరొకరు కారు ప్రక్క నుండి ఆశీర్వదించి, దక్షిణ తీసుకొని మాయమయ్యారు. డ్రైవరు బ్రేకులు వేయకపోయినా కారు ఆగిపోవడం, చిట్నిస్‌కూ, వారి అబ్బాయికి, డ్రైవరుకూ తప్ప కారులోని మరెవ్వరికీ ఆ ఫకీరు కన్పించకపోవడమే చిత్రం!

ఇలాంటి అనుభవాలు సాయి అన్ని మతాలవారికీ ప్రసాదిస్తున్నారు. 'ఓస్‌బోర్న్' అను ఆంగ్లేయుడితో 1960 లో కలకత్తాలో ప్రక్కయింట్లో వున్న కుమారి డట్టన్ తన అనుభవం యిలా చెప్పింది : ఆమె కొంతకాలం ఒక క్రైస్తవ మఠంలో వున్నాక అధికారులతో భేదమొచ్చింది. తాను ఆశ్రమం విడిచిపోయాక తన గతేమిటని ఆలోచిస్తూ దిగులుగా కూర్చొన్నది. ఒక ఫకీరొచ్చి, "భయంలేదు, అంతా బాగుంటుంది" అని చెప్పి దక్షిణ కోరాడు. వెంటనే ఆమెకు ప్రశాంతి కల్గింది. ఆమె వద్ద పైకం లేదంటే ఆయన, "నీ సొరుగులో రూ॥ 35/- లున్నాయి చూడు" అన్నారు. చూస్తే పైకమున్నదిగాని, ఫకీరేలేడు. క్రైస్తవ స్త్రీల ఆశ్రమంలోకి పురుషుడు, ముస్లిమూ అయిన ఫకీరెలా వచ్చాడన్నదే ఆశ్చర్యం! ఆమె ఆశ్రమం విడిచాక, ఆమె మేనల్లుడు ఆమెనెంతో ప్రేమగా చూచుకుంటున్నాడు. ఇదంతా విని ఓస్‌బోర్న్, అప్పుడామెకు సాయి పటం చూపాడు. ఆమె ఆశ్చర్యంతో, "నాకు దర్శనమిచ్చినది వీరే!" అన్నది.

మహబూబ్‌బాషా, సెప్టెంబరు 30, 1982 న తన భార్యకు గర్భకోశంలో వ్రణముంటే గూడూరులో డా॥ సి. ఆర్. రెడ్డిగారి ఆస్పత్రిలో చేర్చాడు. ఆపరేషన్ జరుగుతున్నది. ఆపరేషన్ మధ్యలో ఆమె పరిస్థితి ప్రమాదించింది. బాషా ఒక్కడే డాక్టర్‌గారి గదిలోని బాబాపటం ముందు నిలచి కన్నీటితో ప్రార్థిస్తుండగా వెనుకనుండి తెల్లని గుడ్డలు ధరించిన ఒక ఆజానుబాహువు భుజంతట్టి, "నీ భార్యకేమీ అవదు. బాధపడకు" అన్నారు. బాషా కన్నీరు తుడుచుకొని మళ్ళీ వెనుకకు తిరిగి చూచేసరికి అక్కడెవరూ లేరు! మరుక్షణమే రోగికి ప్రమాదం తప్పిందని నర్సు చెప్పింది.

దయాళ్ శరణ్ (కర్నూల్) యిలా వ్రాశారు : "సం॥ 1981 లో 'శ్రీ సాయి లీలామృతము', 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేసి శ్రీ అయ్యప్ప దర్శనానికి వెళ్ళాను. వ్యానులో కొంతదూరం వెళ్ళాము. తర్వాత 'ఇరుముడి' తో కొండలమీదుగా కొంతదూరం వెళ్ళాక, 49 సం॥ల వయస్సు గల నాకు నీరసమొచ్చి, దిక్కుతోచక బాబాను ప్రార్థించాను. కొద్ది క్షణాలలో చేతిలో కర్ర, కాళ్ళకు రబ్బరు చెప్పులు వేసుకున్న ఒక వృద్ధుడొచ్చి, నా ఎడమ చేయి తన చంకలో పెట్టుకొని, 'భయంలేదు, నిదానంగా నా వెంట నడు!' అన్నారు. వెంటనే నీరసమంతా పోయింది. 'ఈయనెవరు, కొండపైకి చెప్పులతో వచ్చాడు?' అనుకున్నాను. ఆ జనం తొక్కిడిలో కొందరు కాలుజారి పడుతున్నారు. కొందరి 'ఇరుముడు'లు పడిపోయాయి. అందరూ ఎంతో శ్రమపడి నడుస్తున్నారు. అరగంటలో లైట్లతో వెలుగుతున్న ఒక చోటుకు రాగానే, నాచేయి వారి చంకలోంచి జారిపోయింది. వారికి కృతజ్ఞత చెప్పాలని చూస్తే ఆయనెక్కడా కన్పించలేదు!! అందరి కాళ్ళూ పరీక్షగా చూచాను గాని, చెప్పులేసుకున్న వాళ్ళెవ్వరూ లేరు. ఆ రూపంలో సాయియే నన్ను గమ్యం చేర్చారు. "

ఒకరోజు శిరిడీకి 600 మంది భక్తులు వస్తున్నామని సాయి సంస్థానాధికారి పాఠక్‌గారికి కబురు చేశారు. వారి ఏర్పాటుకు రూ-- 1200/- లు కావాలి. కాని నాటి నిధులు ట్రెజరీలో జమచేసామే. ఎలా? అనుకుంటుంటే ఎవరో యిద్దరొచ్చి, 'మేము త్వరగా వెళ్ళాలి, ఈ పైకం రేపు వినియోగించండి' అని బ్రతిమాలి, రూ॥ 1200/- యిచ్చి వెళ్ళిపోయారు. వాళ్ళు శిరిడీ గ్రామస్థులమని చెప్పారు. కాని విచారిస్తే ఆ గ్రామస్థులు కారని తెలిసింది. మూడవరోజు ఒక భక్తుడు పాఠక్‌తో, "సాయి, అబ్దుల్లా వచ్చి మీకు డబ్బిచ్చినట్లు నాకు మూడురోజుల క్రితం కలొచ్చింది" అన్నాడు.

బాబా తమ భక్తులనెన్నడూ పస్తుంచనన్నారు. బోరీబందర్‌కు చెందిన ఒక అడ్వకేట్ శిరిడీ వెళుతుంటే టిక్కెట్టు, రూ॥ 100/- లు రైల్లో ఎవరో దొంగిలించారు. ఆ సంగతి ఎంత చెప్పినా టికెట్ కలెక్టరు వినలేదు. అంతలో ఒక వృద్ధుడు అతని చేతికొక టికెట్ యిచ్చి, తనవారొకరు రానందున ఆ టికెట్ అదనంగా వుందని చెప్పాడు. తాను సాయిభక్తుడనని పరిచయం చేసుకొని, అతని శిరిడీ ఖర్చులన్నీ గూడ భరించి బాబా చరిత్ర గ్రంథంగూడ యిచ్చాడు. బొంబాయిలో తన చిరునామా గూడ యిచ్చి వెళ్ళిపోయాడు. అడ్వకేట్ తిరిగివస్తూ, దారిలో

చరిత్ర గ్రంథం తెరవగానే దానిలో రూ. 10/-ల నోట్లు పది వున్నాయి. అతడిల్లు చేరేసరికి రైల్లో పోయిన పర్సు బాబాపటం దగ్గర వున్నది! ఆ వృద్ధుడికివ్వవలసిన పైకం తీసుకెళ్ళి బొంబాయిలో విచారిస్తే అతని ఆచూకీయే లేదు!! ఆ వృద్ధుడు శ్రీ సాయి బాబాయే.

రాహూరీలో కులకర్ణి తండ్రి 1965లో జబ్బుపడ్డప్పుడు ఒక ఫకీరు వచ్చారు. రోగి భార్య ఆయనకు భిక్ష యిచ్చి, తన భర్తను రక్షించమని కోరింది. ఆయన చిటికెడు పాదధూళి యిచ్చి, "దీనిని నీళ్ళలో వేసి త్రాగమను, 3 రోజుల్లోపల తగ్గుతుంది. వెంటనే నా దర్శనానికి శిరిడీ రమ్మను" అని చెప్పి వెళ్ళిపోయారు. అలానే మూడురోజుల్లో అతని రోగం తగ్గింది. ఆ కుటుంబం శిరిడీ వచ్చి స్థిరపడ్డారు. సం॥ 1976లో కులకర్ణికి జబ్బు చేసింది. ఒకనాటి రాత్రి అతడికి మెలకువ వచ్చేసరికి, బాబా అతడి ప్రక్కనే కన్పించారు : అప్పుడు తలుపులు వేసేవున్నాయి. ఇంట్లో దొంగ దూరాడని అతను కేకలేసేసరికి బాబా నవ్వి, ఆశీర్వదించి మాయమయ్యారు. తెల్లవారేసరికి అతడి జబ్బు తగ్గిపోయింది.

ఒక పేద వితంతువు 1956 లో, పోలియో వచ్చిన తన కొడుకును శిరిడీ తీసుకొచ్చింది. అతనిని కూలివాని భుజంమీద కూర్చోబెట్టి సమాధికి ప్రదక్షిణం చేయిస్తోంది. అది సిగ్గనిపించి, అతడొకరోజు తన బదులు తల్లినే ప్రదక్షిణ చేయమని చెప్పి, ఒంటరిగా గదిలో కూర్చున్నాడు. అకస్మాత్తుగా ఒక సాధువు అతని యెదుట కన్పించి, బలవంతంగా అతనిని లేవదీసి సమాధి వద్దకు తీసుకెళ్ళాడు. అక్కడ అతనికొక స్తంభం పట్టుకు నుంచోమని చెప్పి, ఆయన మాయమయ్యాడు. తర్వాత కొడుకు తనతోకూడా నడవడం చూచాకగాని తల్లి అతని మాట నమ్మలేదు.

బొంబాయిలో ఉద్యోగం చేస్తున్న కరుణాకర్ ఉబ్బసం బాధ భరించలేక ఉద్యోగం మాని, శిరిడీ చేరి, అక్కడ చావడిలో సేవ చేస్తున్నాడు. ఒకరాత్రి అతడు తీవ్రమైన జ్వరము, దగ్గుతో బాధపడుతున్నాడు. కొద్ది కునుకుపట్టగానే కలలో సాయి కన్పించి, "ధునిలో కొబ్బరికాయ, అగరవత్తులు, కర్పూరము సమర్పించు!" అన్నారు. అతడు మరురోజు ధునిపూజ చేసాక, పగలు బాధలు తగ్గి, రాత్రి మాత్రం రాసాగాయి. అతడు ఒంటిపూట భోంచేస్తూ పగలంతా పనిచేసేవాడు. ఆ రోజుల్లో శివనేశన్ స్వామి మధ్యాహ్న భోజనమయ్యాక, ద్వారకామాయిలోని రథశాలలో పడుకునేవారు. ఒకరోజు సాయంత్రం 4 గం॥లకు కరుణాకర్ ఆయనవద్ద కొచ్చి, 'నాకు మీరేమైనా తినడానికిచ్చారా?' అన్నాడు. లేదన్నారు స్వామి. అతడాశ్చర్యపోయి, "అదేమిటి, మీరు నాకీ వేరు యిచ్చి, దీన్ని నోట్లో వుంచుకుంటే నా బాధ తగ్గుతుందని చెప్పారు కదా?" అని ఒక వేరు చూపాడు. ఇద్దరూ ఆశ్చర్యపోయి అది సాయిలీలే అని గుర్తించారు. దానితోనే అతడి ఆరోగ్యం బాగుపడింది. అతడు శిరిడీ విడిచి వెళితే వ్యాధి మళ్ళీ వచ్చి, తిరిగి శిరిడీ రాగానే తగ్గేది! అందుకే అతడు శిరిడీలో వుండిపోయాడు.

జె. వి. రమణమూర్తి (రాజమండ్రి) యిలా వ్రాసారు : "స్వతహాగా నేనెంతో కోపిష్టిని. ఎన్నో అపరాధాలు చేసాను. 'శ్రీ సాయిలీలామృతము' ఒకసారి చదివాక నాకు కోపం తగ్గిపోయింది. కొంతకాలానికి నేను శుష్కిస్తుంటే డాక్టర్లు పరీక్షచేసి కాన్సర్ అన్నారు. నేను చికిత్సకు మద్రాసు వెళ్ళాలని రూ॥ 3000/- లు సిద్ధం చేసుకొని జూన్ 25 సాయంత్రం 'శ్రీసాయి లీలామృతం' పారాయణ చేస్తుండగా ఒక వృద్ధ బ్రాహ్మణుడు విఠల్ నామం ముద్రించిన శాలువ కప్పుకొని వచ్చాడు. మొదట కొద్దిసేపు నావద్దనున్న గ్రంథాలు తిరగేసి, 'బాగుంది! నాకు రూ. 20/- లు కావాలి' అన్నారు. నా దగ్గర డబ్బు లేదంటే, 'మద్రాసు వెళుతున్నావుగా, వెళ్ళు నీకేమీ వుండదు!' అని వెళ్ళిపోయారు. ఇంతలో నా భార్యవచ్చి, ఆ రూపంలో బాబాయే వచ్చారనగానే నాకు దుఃఖమాగలేదు, మరురోజు గురువారం, భరద్వాజగారినడిగితే, బాబాకు అగరొత్తిపెట్టి క్షమాపణ చెప్పుకోమన్నారు. అలానే చేసాను. నాటి సాయంత్రం సత్సంగం నుండి యింటికి వెళ్ళేలోగానే ఆ స్వామి వచ్చి రూ. 20/- లు తీసుకెళ్ళారట. తర్వాత నన్ను మద్రాసులో పరీక్షచేసి నా వ్యాధి కేన్సర్ కాదని తేల్చారు".

యస్. బాబువలీ యిలా వ్రాసాడు : "బి. ఎ. చదివిన నేను నాస్తికుడిగా, దేశదిమ్మరిగా తిరిగేవాణ్ణి. సం॥ 1985 లో నా వివాహమై ఒంగోలు వస్తుంటే నా సోదరికి జ్వరమొచ్చింది. ఒక స్టేషన్‌లో ఒక సాధువు వచ్చి సాయిని స్మరించి విభూతి యిస్తే గంటలో ఆమెకు జ్వరం తగ్గింది. అప్పటినుండి నాకు విశ్వాసం కల్గి, 'శ్రీ గురుచరిత్ర', 'శ్రీ సాయి లీలామృతము' పారాయణ చేస్తున్నాను. ఆ క్రిందటి సంవత్సరం నా తల్లిదండ్రులు పారాయణ చేస్తుంటే ఒక సాధువు ఒంగోలులో మాయింటికొచ్చి, నాకు త్వరలో వివాహమవుతుందని, తాము నవంబర్ 1985లో వస్తామనీ చెప్పారు. ఆ లోపలే నాకు పాప పుట్టింది. తర్వాత ఆ సాధువు మా ఎదురింటికి వచ్చి, మాయింట్లో 'గులాబి' వున్నదని, అందువలన ఆ పురుటింటికి వెళ్ళననీ చెప్పారట. పాప పుట్టిన 40వ రోజున భరద్వాజ మాస్టర్‌గారి దగ్గరకు తీసుకువెళ్ళి వారికి నచ్చినపేరు పెట్టమంటే, ఆయన పాపకు 'గులాబి' అని పేరు పెట్టారు!"

ఒకరోజు శ్రీమతి పి. అరుంధతి 'పైలాను'లో వారి యింటి గడపలో పడుకొన్నారు. ఇంటి పూజగదిలోంచి బాబావచ్చి, "మంచం అడ్డం తియ్యి! అక్కడ అబ్బాయి ఆపదలో వున్నాడు!!" అన్నారు. ఆమె మంచం తీయగానే ఆయన బైటకు వెళ్ళి మరలా వచ్చి, "అదృష్టం! నీవు మంచం తీయడం ఆలస్యమైంది గనుక నేనొకచెట్టు అడ్డమేసాను. దానికి కొట్టుకొని జీపు ఆగింది" అని పూజ గదిలోకి వెళ్ళిపోయారు. కొద్దిసేపట్లో కబురొచ్చింది. వారి అబ్బాయి నాగార్జునసాగర్‌లో జూనియర్ ఇంజనీర్. సరిగా ఆ రోజు అదే సమయానికి అతడెక్కిన జీపు ఒక లోయను సమీపిస్తుండగా బ్రేకులు పనిచేయలేదు. కొద్ది అడుగులలో జీపు ఒక లోయలో పడుతుందనగా చిత్రంగా ఒక చెట్టుకు కొట్టుకొని ఆగిపోయింది. ఎవరికీ ఎట్టి ప్రమాదమూ జరగలేదు. ఇంట్లో పటముంటే సాయి వున్నట్లే!

గుజరాత్‌లో (1898 - 1976 మధ్యకాలంలో) చునీలాల్ ఆశారామ్ భగత్ అనే గొప్ప సాయి భక్తుడుండేవాడు. అతడు మొదట శ్రీ ఉపాసనీబాబా వద్ద ఉపదేశము, తర్వాత శ్రీధునివాలేదాదాగారి అనుగ్రహమూ గూడ పొందాడు. అటు తర్వాత అతడు ఒకరోజు కరాచీలో సముద్రతీరాన నడుస్తున్నాడు. హఠాత్తుగా శ్రీ సాయిబాబా అతనికి ప్రత్యక్షమై, అతనిని సముద్రంలోకి నడవమన్నారు! వెంటనే అతడు సముద్రంలోకి నడిచాడు. అతడి తల మునిగిన క్షణంలోనే అతణ్ణి నీరు విసురుగా ఒడ్డున పడేసిందిగాని అప్పటికే అతడు బాహ్యస్మృతి కోల్పోయి చాలాసేపటివరకూ స్పృహలోకి రాలేదు. అతడు తిరిగి యిల్లు చేరాడు. తర్వాత ఒక బక్రీద్ పండుగనాడు అతనికి మశీదుకు వెళ్ళి నమాజు చేయాలన్పించింది. అతడు ధోవతి, టోపి పెట్టుకొని నమాజుకు వెడితే ముస్లిములు దండిస్తారని బంధువులు హెచ్చరించినా అతడు అలానే వెళ్ళాడు. అక్కడ అతనికెవరూ అడ్డుచెప్పలేదు. అతడు 'నమాజు' పూర్తి చేసుకొని బయటకు రాగానే మరలా సాయిబాబా అతనికి భౌతికంగా దర్శనమిచ్చి భుజంతట్టి, 'భేష్, చాలా మంచిపని చేసావు! ఇప్పుడు నగ్నంగా ఇంటికి పో!' అన్నారు. అతడు నివ్వెరపోయాడు. అది ఇస్లాముకు విరుద్ధం గనుక అలాచేస్తే అచటి ముస్లింలతో తగువు కొనితెచ్చుకోవడమే అవుతుంది. కాని సద్గురువు ఆజ్ఞ మీరడమంటే జీవితాంతమూ కష్టించి సాధన చేసాక అంతిమ పరీక్షలో విఫలులవటమే; వంటంతా చేసుకొని అన్నం తినలేకపోయినట్లే! అట్టి అవకాశం యికరాదు. వెంటనే అతడు ఒక స్నేహితునికి సాయి ఆజ్ఞ తెల్పి, తాను విడచిన వస్త్రాలు భద్రంగా యిల్లు చేర్చమని చెప్పి వెంటనే తన వస్త్రాలు విడిచాడు. అలా చేయగానే అతనికి ఆనంద పారవశ్యంకల్గి, పెద్దగా కేకపెట్టి, జనంతో కిక్కిరిసిన కరాచీ వీధులవెంట సుమారు 6,7 మైళ్ళు పట్టపగటి సమయంలో పరిగెత్తాడు! అంతకు మించి అతడికింకేమీ తెలియలేదు. ఒక్కచోట మాత్రం ఒక బ్రిటిష్ పోలీస్ యిన్స్పెక్టర్ అతనిని అడ్డగించబోయాడు. చూనీలాల్ పెద్దగా "సాయిబాబా! ఈద్ ముబారక్!" అని కేకవేయడంతో ఆ పోలీసు అధికారి గూడ వైదొలగి, 'ఈద్‌ముబారక్' చెప్పాడు!!

తర్వాత కొద్దికాలంలోనే అతనికి ఆధ్యాత్మిక వికాసం కల్గింది. శ్రీ సాయిబాబా ఆయన ఎదుట సాక్షాత్కరించి

ఎన్నెన్నో యోగసాధనలు నేర్చారు; ఎన్నో అద్భుతమైన అనుభవాలు ప్రసాదించారు. చిట్టచివరకు శ్రీరామనవమి, మార్చి 29, 1939న వారణాసిలో అతనికి అద్వైతానుభవంగూడ ప్రసాదించారు. అటుతర్వాత ఆయన 'శ్రీ మోటా మహరాజ్' అనుపేర పరిపూర్ణుడైన సిద్ధపురుషుడిగా పేరు పొందారు. 'నశ్వరమైన శరీర సౌఖ్యాలపట్ల ఉదాసీనత చెంది, అత్యంతిక సుఖంకోసం యత్నించే భక్తులకు పరమార్థాన్ని చేకూర్చడం శ్రీ సాయిబాబాకెంతో సంతోషము'' అన్న ''శ్రీసాయి సచ్చరిత్ర (మరాఠీ) వాక్యం ఎంత సార్థకమో!

★★★

